నకిలీ బంగారం ఇచ్చి రూ.3లక్షలు కాజేశారు
7 లో..







శక్తిస్వరూపిణీ పాహిమాం..

- మహిషాసుర మర్దినిగా విద్యాసరస్వతి
- వేడుకలకు హాజరైన రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్


అమ్మవారిని దర్శించుకుంటున్న లక్ష్మణ్ కుటుంబసభ్యులు

వర్గల్, అక్టోబరు 11: శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం విద్యాసరస్వతి అమ్మవారు భక్తులకు మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. 108 కలశాలతో అష్టోత్తర శత కలశాభిషేకం, చండీహోమం చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ కుటుంబసభ్యులతో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి, నాయకులు మరం మైపాల్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. అలాగే గజ్వేల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి దంపతులు వేడుకల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహిస్తున్న వేద పండితులు



విజయీభవ..

నేడు విజయదశమి

- రావణ దహనానికి ఏర్పాట్లు
- బందోబస్తు చేపట్టనున్న పోలీసులు

సిద్దిపేట కల్చరల్, అక్టోబర్ 11 : చెడుపై సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి(దసరా) పండుగను జరుపుకుంటారు. శనివారం విజయదశమి సందర్భంగా పల్లె, పట్నం సందడిగా మారాయి. దసరా వేడుకలకు జిల్లాలోని ఆయా చోట్ల రావణదహనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సిద్దిపేట పట్టణంలోని రంగాధాంపల్లి చౌరస్తా, నర్సాపూర్, రూరల్ పోలీస్‌స్టేషన్ చౌరస్తా, ఎన్సాన్‌పల్లిలో రావణ దహనం పెద్దఎత్తున జరుగుతుంది. సిద్దిపేటలో జరిగే రావణ దహనానికి పట్టణవాసులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివస్తారు. నిర్వాహకులు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక నర్సాపూర్‌లో జరిగే వేడుకలు వినూత్నంగా ఉంటాయి. గ్రామంలో రావణ దహనం చేయటంతో పాటుగా జాతీయ జెండాను గ్రామస్థులు ఎగురవేస్తారు. ఈ ఆనవాయిగా కొన్నేళ్లుగా కొనసాగుతూ వస్తుంది. దసరా పండుగ సందర్భంగా మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఏసీపీ మధు, నిర్వాహకులు

దసరా ఏర్పాట్లను సిద్దిపేట ఏసీపీ మధు పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పండుగ వేళ రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా రోడ్లపై స్టాపర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏసీపీ మధుతో పాటు త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి, రంగధాంపల్లి వార్డు కౌన్సిలర్ రేణుకా తిరుమల్‌రెడ్డి, హనుమాన్‌ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.


సిద్దిపేటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ మధు, స్థానిక ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు


రంగధాంపల్లి వద్ద రావణ దహనానికి ఏర్పాట్లు


సామగ్రిని తరలిస్తున్న యువకులు

ఘనంగా ఆయుధ పూజ

సిద్దిపేట క్రైం, అక్టోబరు 11 : పెద్దకోడూరు గ్రామశివారులో గల సాయుధ దళాల కార్యాలయంలో పోలీస్ కమిషనర్ అనురాధ ఆయుధాలకు, ప్రభుత్వ వాహనాలకు వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం జమ్మి చెట్టుకు పూజలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ చేసే ప్రతీ పనిలో అధికారులు, సిబ్బంది విజయం సాధించాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు, సిబ్బందికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు రాంచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ మధు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ధరణి, పూర్ణచందర్, ప్రసాద్, రాజేష్, విష్ణుప్రసాద్, ఆర్ఎస్ఐలు రోహిత్, రంజిత్, బాలకృష్ణ, అంజయ్య, చిన్నకోడూర్ ఎస్ఐ బాలకృష్ణ, ఏఆర్ అధికారులు సిబ్బంది మరియు సాయుధ దళ పోలీసులు, పోలీస్ మోటారు వాహనాల చోదకులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అయుధ పూజ చేస్తున్న సీపీ అనురాధ

రండి బాబు రండి..

- పండుగవేళ మటన్ చికెన్‌లపైనా ఆఫర్లు

కొండపాక, అక్టోబరు 11: పండుగలు వచ్చాయంటే ఆయా దుకాణాల యజమానులు ఆఫర్లు ప్రకటిస్తుంటారు. మరీ ముఖ్యంగా దసరా, దీపావళి పండుగలకు వినియోగదారులను ఆకట్టుకోవడానికి పెద్ద పెద్ద కంపెనీలు ప్రత్యేక ఆఫర్లను తీసుకొస్తాయి. ఇక కార్లు, బైక్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులపై ప్రకటించే ఆఫర్లు అయితే ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పట్టణాలపై పరిమితమైన ఈ ఆఫర్ల ప్రక్రియ గ్రామాలకు కూడా పాకింది. మటన్, చికెన్ తీసుకుంటే కూపన్లు ఇస్తూ లక్కీ డ్రా ద్వారా బహుమతులు అందచేస్తామని ఆకర్షిస్తున్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం సిరిసినగండ్ల గ్రామంలో ఓ చికెన్ సెంటర్ నిర్వాహకులు దసరా ఆఫర్ పెట్టి గ్రామస్థులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.



సిరిసినగండ్లలో ఏర్పాటు చేసిన బ్యానర్


రోహిణి, రోషిణిలకు స్వీట్స్ తినిపిస్తున్న తల్లిదండ్రులు రాంచంద్రం, శారద, చిత్రంలో మాధురి, మమత

దర్జీ ఇంట్లో డాక్టర్స్

- ఒకే ఇంట్లో నలుగురు అమ్మాయిలకు మెడిసిన్ సీట్లు
- 2024 నీట్‌లో ఇద్దరు కవలలకు ..
- ఇప్పటికే మెడిసిన్ చదువుతున్న మరో ఇద్దరమ్మాయిలు

7 లో..

అంతర్జాతీయ స్థాయిలో బోధన

- ఒకే కాంప్లెక్స్‌లో నాలుగు గురుకులాలు
- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- తంగళ్లపల్లిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి భూమి పూజ

కోహెడ, అక్టోబరు 11: హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండలం తంగళ్లపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల కాంప్లెక్స్‌కు రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం భూమిపూజ చేశారు. అనంతరం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నమూనాలను వీడియో రూపంలో మంత్రి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపముఖ్యమంత్రి ఆలోచనతోనే అంతర్జాతీయ స్థాయిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌ల ఏర్పాటు జరుగుతుందన్నారు. ఒక్కో పాఠశాలను రూ. 180 కోట్లతో నిర్మించనున్నట్లు చెప్పారు. మొత్తం రూ.5వేల కోట్లతో ఈ పాఠశాలల నిర్మాణం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 28 నియోజకవర్గాల్లో ఈ పాఠశాలలకు భూమిపూజ చేసినట్లు మంత్రి పొన్నం తెలిపారు. జీవో 190 ద్వారా నాలుగు గురుకులాలు ఒకే కాంప్లెక్స్‌లో ఉండడం, విద్య బోధన కూడా అంతర్జాతీయ స్థాయిలో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ రెసిడెన్షియల్ ప్రారంభంతో విద్యారంగంలో హుస్నాబాద్ నియోజకవర్గం మరింత ముందుకు దూసుకెళ్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నాలుగో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇక్కడే చదువుకునేలా అన్ని వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. వచ్చే విద్యాసంవత్సరంలోపు ఈ పాఠశాల భవన నిర్మాణం పూర్తిచేస్తామని మంత్రి స్పష్టం చేశారు. అన్నిరకాల వాతావరణానికి తగిన విధంగా ఈ భవన నిర్మాణం జరుగుతుందని, అంతర్జాతీయ స్థాయిలో వసతులు కల్పించి తీర్చిదిద్దుతామని వివరించారు. ఇక ఈ ప్రాంతం ఎడ్యుకేషన్ హబ్‌గా మారాలని పేర్కొన్నారు. కోహెడ మండలం బస్వాపూర్‌లో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన చేపట్టామని, త్వరలోనే భూమి పూజ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలోని సైదాపూర్ మండలంలో సర్వాయిపేటలో టూరిజం హబ్, హుస్నాబాద్‌లో ఎల్లమ్మ చెరువు అభివృద్ధికి రూ 37 కోట్లుతో అభివృద్ధి పనులు, అక్కన్నపేటలో పరిశ్రమల హబ్, ఎల్కతుర్తిలో 100 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అదనపు శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రామ్మూర్తి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, పార్టీ ముఖ్యనేతలు జగన్‌రెడ్డి, బొబ్బల మోహన్ రెడ్డి, పాము శ్రీకాంత్, బందెల బాలకిషన్, వెంకటస్వామి, బి నారాయణ గౌడ్, కర్ర రవీందర్, మల్లారెడ్డి, గోరిట్యాల లక్ష్మణ్, ఎమ్మార్వో సురేఖ, అధికారులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న మంత్రి పొన్నం


తంగళ్లపల్లిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నమూనా

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నీలం మధు

పటాన్‌చెరు రూరల్, అక్టోబర్ 11 : బీసీల సామాజిక, ఆర్థిక, కుల సర్వే తక్షణమే ప్రారంభించాలని ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ నాయకుడు నీలం మధు ధన్యవాదాలు తెలిపారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎం నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. బీసీల సామాజిక, ఆర్థిక, కుల సర్వే తక్షణమే ప్రారంభించి 60 రోజులలో పూర్తి చేసి స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని తీసుకున్న నిర్ణయంపై నీలం మధు హర్షం వ్యక్తం చేస్తూ బీసీ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నీలం మధుకు సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా సూచించారు. ముఖ్యమంత్రి సూచనలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.



రేవంత్ రెడ్డికి మొక్క అందజేస్తున్న నీలం మధు

దర్జీ ఇంట్లో డాక్టర్స్

ఒక కూతురు పుడితేనే భారంగా భావించే ఈ రోజుల్లో నలుగురు కూతుళ్లను దర్జీ వృత్తిని కొనసాగిస్తూ ఉన్నత చదువులు చదివించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం.. కుటుంబ కష్టాలను చిన్నప్పటి నుంచి చూసిన ఆ నలుగురు యువతులు చదువులో సత్తాచాటారు. తాజాగా విడుదలైన నీట్ ఫలితాల్లో సిద్దిపేట పట్టణం సమీపంలోని నర్సాపూర్‌కు చెందిన కొంక రోహిణి, రోషిణి అనే కవలలు మెడిసిన్‌లో సీటు సంపాదించారు. అయితే ఇదే ఇంటి నుంచి వీళ్ల ఇద్దరు అక్కలు కూడా మెడిసిన్ చేస్తున్నారు. మొత్తంగా నలుగురు అమ్మాయిలు ఒకే కుటుంబం నుంచి మెడిసిన్ చదువుతున్నారు. పేదరికాన్ని ఎదురొడ్డి నిలిచి నలుగురు అమ్మాయిలు ఎందరికో ఆదర్శంగా నిలిచారు.


తల్లిదండ్రులు, వారి నలుగురు కుమార్తెలను అభినందిస్తున్న మాజీ మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట కల్చరల్, అక్టోబర్ 11 : సిద్దిపేట పరిధిలోని నర్సాపూర్‌కు చెందిన కొంక రాంచంద్రం, శారద దంపతులకు నలుగురు కూతుళ్లు. 14 సంవత్సరాల నుంచే కుటుంబ పోషణభారం రాంచంద్రం మీద పడటంతో కులవృత్తి టైలరింగ్ చేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఒక కూతురు పుడితేనే కంగారు పడే సమాజంలో నలుగురు కూతుళ్లను కష్టపడి చదివించాడు. తమ కుటుంబ నేపథ్యాన్ని వివరిస్తూ వారిని ప్రోత్సహించాడు. నలుగురు కూతుళ్ల మెడిసిన్‌లో సీటు సంపాదించేలా ధైర్యాన్ని నింపాడు. ఈ దంపతుల పెద్ద కూతురు కొంక మమత 2018లో నీట్‌లో 521 ర్యాంకు రావటంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ సిదార్థ గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. ఈ సంవత్సరం మార్చిలో మమత ఎంబీబీఎస్ పూర్తయింది. రెండవ కూతురు కొంక మాధురికి 2020లో నీట్ ఎంబీబీఎస్ సీటు రాగా, ప్రస్తుతం కరీంనగర్ చల్మెడ ఆనందరావు కాలేజ్‌లో ఫైనల్ ఇయర్ చదువుతుంది. ఇక మిగిలిన ఇద్దరు కవల అమ్మాయిలు కొంక రోహిణి, కొంక రోషిణి తాజాగా విడుదలైన నీట్ ఫలితాల్లో మెడిసిన్‌లో ర్యాంకులు సాధించారు. కొంక రోహిణికి స్టేట్ ర్యాంకు 2570, ఆలిండియాలో లక్షా 55 వేల ర్యాంకు, కొంక రోషిణికి రాష్ట్ర స్థాయిలో 1061, ఆలిండియాలో 91603 ర్యాంకు వచ్చింది. అంతేకాకుండా కొద్ది రోజుల కిందట జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అడ్మిషన్ తీసుకున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు రోషిణి, రోహిణి వైద్య విద్య కోసం రూ.50 వేలు ఆర్థిక సాయంగా అందించారు. భవిష్యత్‌లో ఏ అవసరమున్నా తన వద్దకు రావాలని సూచించారు.

చిన్నప్పటి నుంచి కష్టాలే..

రాంచంద్రం కుటుంబాన్ని చిన్నప్పటి నుంచి కష్టాలు అంటిపెట్టుకుని ఉన్నాయి. రాంచంద్రం సోదరుడు పక్షవాతంతో 1992లో చనిపోయాడు. చేతికొచ్చిన కొడుకు చనిపోవటంతో రాంచంద్రం తల్లి కన్నీరుమున్నీరుగా విలపించేది. ఆ తర్వాత రెండేళ్లకు రాంచంద్రం తల్లి 1994లో గొంతు కేన్సర్ కారణంగా కాలం చేశారు. దీంతో కుటుంబ పోషణ భారం రాంచంద్రం తీసుకుని కులవృత్తి చేసుకుంటూ జీవితాన్ని నెట్టుకొస్తున్నాడు. 1998లో శారదతో వివాహం అయ్యింది. నలుగురు ఆడపిల్లలు పుట్టగా వారిని కష్టపడి చదివిస్తున్నాడు. సాఫీగా సాగుతున్న సమయంలో మరో కుదుపు కుటుంబాన్ని ఆలోచనలో పడేసింది. 2008లో రాంచంద్రం తండ్రి కూడా అనారోగ్య కారణాలతో దూరమయ్యాడు. ఈ కష్టాలనే కూతుర్లకి చెబుతూ వారికి వైద్య విద్యపై మక్కువ పెరిగేలా చేశాడు. అవగాహన లేకనే అందరు అనారోగ్య కారణాల వల్ల చనిపోయారని గుర్తు చేస్తుండేవాడు రాంచంద్రం.

● ఒకే ఇంట్లో నలుగురు అమ్మాయిల వైద్య విద్య
● 2024 నీట్‌లో ఇద్దరు కవలలకు మెడికల్ సీట్లు
● ఇప్పటికే పెద్ద అమ్మాయి మెడిసిన్ పూర్తి.. ఫైనల్ ఇయర్‌లో మరో అమ్మాయి


చదువుకుంటున్న మమత, మాధురి, రోహిణి, రోషిణి

చాలా సంతోషంగా ఉంది

మా నలుగురు పిల్లలు మెడిసిన్ సీటు రావటం చాలా సంతోషంగా ఉంది. చిన్నప్పటి నుంచి కష్టపడ్డాం. ఆ కష్టం పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాను. మంచిగా చదివితే వారి భవిష్యత్‌తో పాటుగా అందరం బాగుంటామని చెప్పాం. అందుకు తగ్గట్టుగానే కష్టపడి చదివారు చాలా ఆనందంగా ఉంది.

-రాంచంద్రం, శారద, తల్లిదండ్రులు

చిన్నప్పటి నుంచి డాక్టర్ కావాలనుకున్నా

చిన్నప్పటి నుంచి డాక్టర్ కావాలని బలంగా ఉండేది. మా నాన్న చెబుతుంటే నాకు అనిపించేది మా ఇంట్లో జరిగిన నష్టం ఇంకో ఇంట్లో జరగకూడదని అనుకునేదాన్ని. ఎంబీబీఎస్ మార్చిలో పూర్తయింది. గైనకాలిజిస్టు కావలనుకుంటున్నా. పేదవాళ్లకి మెరుగైన వైద్యం అందించడానికి పనిచేస్తా.

-కొంక మమత

మా నాన్న, అక్క స్ఫూర్తితోనే ..

మా ఇంట్లో పరిస్థితులు, మా అక్క కష్టపడి చదివి ఎంబీబీఎస్‌లో సీటు సంపాదించటం నన్ను అటువైపు వెళ్లేలా చేసింది. మా నాన్న ప్రోత్సాహం, మా అక్క గైడెన్స్‌తో 2020లో నీట్‌లో ర్యాంకు సాధించాను. ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. ప్రభుత్వ కళాశాలలో పీజీ సీటు తెచ్చుకునేందుకు ప్రిపేర్ అవుతున్నా.

-కొంక మాధురి

ఇద్దరక్కలే మాకు ఆదర్శం

మా కుటుంబ నేపథ్యం, మా నాన్న అందించిన ప్రోత్సాహం, మా ఇద్దరక్కల స్ఫూర్తితోనే మెడిసిన్ చదవాలనుకున్నాం. అందుకు తగ్గట్టుగా ప్రిపేర్ అయ్యాం. మా అక్కల గైడెన్స్ బాగా ఉపయోగపడింది. మరింత కష్టపడి చదివి పేదవాళ్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పనిచేస్తాం.

-కొంక రోహిణి, కొంక రోషిణి


రాంపాల్‌నాయక్‌ను అభినందిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

పేద వైద్య విద్యార్థికి అండగా మాజీ మంత్రి హరీశ్‌రావు

● హాస్టల్, కాలేజీ ఫీజు రూ.3.75 లక్షలు చెల్లింపు

నారాయణఖేడ్, అక్టోబరు 11: ఖేడ్ మండలం పలుగుతండాకు చెందిన రాంపాల్‌నాయక్‌కు మూడేళ్ల క్రితం ప్రభుత్వ కళాశాలలో వైద్య సీటువచ్చింది. కాగా, హాస్టల్‌ఫీజు చెల్లించలేని పరిస్థితిని తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రెండేళ్లకు సంబంధించిన హాస్టల్ ఫీజు రూ.2.40 లక్షలతో పాటు ప్రస్తుత సంవత్సర ఫీజు రూ.1.35 లక్షలను చెల్లించి ఆదుకున్నారు. శుక్రవారం రాంపాల్‌నాయక్‌తోపాటు అతడి తల్లిదండ్రులు శంకర్ నాయక్, సక్రిబాయి హైదరాబాద్‌కు వెళ్లి హరీశ్‌రావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాంపాల్ నాయక్‌కు హరీశ్‌వు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. బాగా చదువుకొని పేదలకు వైద్యం అందించాలని సూచించారు.

బాధిత కుటుంబాలకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పరామర్శ


బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ బక్కి వెంకటయ్య

తొగుట, అక్టోబరు 11 : మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇటీవల ఇటీవల మృతి చెందిన గ్రామ మాజీ సర్పంచ్, మాజీ సొసైటీ చైర్మన్ ఎన్నం మల్లారెడ్డి, అదేవిధంగా జూపల్లి సత్తయ్య కుటుంబాన్ని ఆయన పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు చిలువేరి మల్లారెడ్డి, నాయకులు జానారెడ్డి, గోవింద రెడ్డి, పాత్కుల బాలేష్, ఎన్నం యాదవ రెడ్డి, పులిందర్ రెడ్డి, స్వామి గౌడ్, మంగలి బాలరాజు, నాయకులు, మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రావి ఆకులపై దసరా ప్రాముఖ్యత





నారాయణఖేడ్, అక్టోబరు 11: లోక కంటకుడైన మహిషాసురుడిని జగన్మాత సంహరించినందుకు చెడుపై మంచి, దుష్టశక్తులపై దైవ శక్తుల విజయానికి ప్రతీకగా జరుపుకునే పండుగే విజయదశమి. చెడు ఎంత దుర్మార్గమైనదైనా ఎంత శక్తివంతమైన విజయం మంచినే వరిస్తుంది. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు శివకుమార్ మాత ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటూ దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రావి ఆకులపై మహిషాసురమర్థిని, దుర్గామాత, రావణసంహార చిత్రాలను వేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

ఓట్ల రాజకీయాల కోసం లౌకికవాదం పేరిట విమర్శలు

● బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

వర్గల్, అక్టోబరు 11: దేశంలో ఓట్ల రాజకీయాల కోసం లౌకికవాదం పేరిట కొందరు సనాతనధర్మాన్ని విమర్శించడం పరిపాటిగా మారిందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు కె. లక్ష్మణ్ పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా వర్గల్ కేంద్రంలోని విద్యా సరస్వతీ ఆలయాన్ని ఆయన కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ హిదూ సమాజం లౌకికవాదుల చర్యలను అడ్డుకోవడానికి మరింత చైతన్యవంతం కావాలన్నారు. యువత యాంత్రిక జీవనానికి లోనై ఒత్తడి తట్టుకోలేక ధర్మంపట్ల ఆకర్షితులవడం శభ పరిణామమన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ కష్టకాలంలో ఉన్న దేశాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చారన్నారు. కంచికామకోటీ పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి వర్గల్ విద్యాధరి క్షేత్రం అద్భుతంగా ఉందని, విద్యా సరస్వతీ అమ్మవారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గురువారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు మైపాల్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రైల్వే గేట్ కీపర్ నిర్లక్ష్యం.. ఆగిన రైలు

కుకునూరుపల్లి, అక్టోబరు 11: ఓ రైల్వే గేట్ కీపర్ నిర్లక్ష్యంతో శుక్రవారం కొద్దిసేపు రైలు ఆగిపోయింది. ఈ ఘటన కుకునూరుపల్లి మండలం బొబ్బాయిపల్లి గ్రామశివారులో చోటుచేసుకుంది. వాహనదారుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్ నుంచి సిద్దిపేటకు వెళ్లిన రైలు మధ్యాహ్నం సమయంలో తిరిగి సికింద్రాబాద్‌కు వెళ్తున్నది. ఆ సమయంలో బొప్పాయిపల్లి శివారులోని రైల్వే గేటు పట్టాలపై ఇరువైపులా ఎరుపు రంగు సూచికలు చూసి రైలు పైలెట్ రైలు ఆపారు. వాస్తవానికి ఆ సూచికలు రైలు వచ్చి.. వెళ్లే క్రమంలో పట్టాలపై ఉంచరు. అలాగే, రైలు వచ్చే సమయంలో గేటు మూసి వాహన రాకపోకలు ఆపేస్తారు. కానీ, గేట్ కీపర్ గేటు తెరిచి ఉంచి.. పట్టాలకు ఇరువైపులా ఎరుపురంగు సూచికలు ఉంచారు. దీంతో రైలు ఆగిపోయింది. పైలెట్ గట్టిగా హారన్ కొట్టడంతో ఆ శబ్ధానికి గదిలో ఉన్న గేట్ కీపర్ వచ్చి గేటును దించి, సూచికలు తీసేశారు. దీంతో రైలు ముందుకు కదలింది. అయితే, పట్టాలకు ఇరువైపులా ఎర్రరంగు సూచికలు తీసేసి.. గేటు వేయకుంటే పెద్ద ప్రమాదం జరిగేదని అక్కడి వారు చెబుతున్నారు.


రైలు వచ్చి ఉన్నా తెరిచే ఉన్న రైల్వే గేటు

ఆకట్టుకున్న ఆర్‌ఎస్‌ఎస్ కవాతు


సిద్దిపేటలో కవాతు నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

సిద్దిపేట క్రైం, అక్టోబరు 11 :రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రారంభించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిద్దిపేటలో పద సంచలన్ కార్యక్రమం నిర్వహించారు. హైస్కూల్ మైదానం నుంచి పుర వీధుల గుండా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ఏకరూప దుస్తులు ధరించి, దండ పట్టుకొని కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్‌ఎస్‌ఎస్ ఉమ్మడి జిల్లా కార్యవాహ జనరల్ సెక్రటరీ నాగభూషణం హాజరై మాట్లాడారు. వ్యక్తి నిర్మాణం, హిందూ సమాజ సంఘటన, దేశాన్ని పూర్వ వైభవ దిశకు తీసుకెళ్లేందుకు స్వర్గీయ డాక్టర్ కేశవరావు బలిరామ్ పంత్ హెడ్గేవర్ ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించారన్నారు. అనేకమంది సంఘ కార్యకర్తలు విద్యాలయాలు స్థాపించి పేద విద్యార్థులకు ఉచితంగా విద్య అందిస్తున్నారన్నారు. భూకంపాలు వరదలు వంటి ఆపత్కాలంలో స్వయం సేవకులు ముందుండి సేవా కార్యక్రమాలు, సహాయక చర్యలు చేపడతారన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాలను గ్రామ గ్రామాన చేరవేసేందుకు శత జయంతి ఉత్సవాలను ఈ దసరా నుంచి వచ్చే దసరా వరకు నిర్వహిస్తామన్నారు. ప్రతీ గ్రామానికి సంఘ శాఖను తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సురేష్‌గౌడ్, బాసంగారి వెంకట్, కిష్టయ్య కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకలో ర్యాలీ

దుబ్బాక, అక్టోబరు 11: ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ స్వర్ణోత్సవాల సందర్భంగా శుక్రవారం ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకులు దుబ్బాక పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి, సంఘగీత్‌లను పాడడంతోపాటు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు

గీతంలో నవరాత్రి వేడుకలు

పటాన్‌చెరు రూరల్, అక్టోబర్ 11 : హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు బతుకమ్మ, నవరాత్రి సంబరాలను 'జష్న్-ఎ-బహార' పేరిట శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం పలువురికి శాశ్వత జ్ఞాపకాలను మిగిల్చింది. బతుకమ్మ తయారీ, రంగోలి పోటీలో ఉత్సాహభరితంగా పాల్గొని, తమ సృజనాత్మకతను చాటారు. ఫుడ్ స్టాళ్లలో వివిధ రకాల రుచికరమైన వంటకాలను ఆస్వాదించారు. చివరగా, మరపురాని గర్బా నైట్‌తో వేడుకలను ముగించారు. హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌లో శుక్రవారం 'ప్రపంచ వాస్తుశిల్పుల దినోత్సవా'న్ని నిర్వహించారు. పర్యావరణంతో పాటు జన సమూహాలకు సేవలందించడంలో ఆర్కిటెక్చర్ పోషిస్తున్న కీలక పాత్రను గుర్తించే లక్ష్యంతో దీనిని నిర్వహించారు. భవనాల రూపకల్పన, పట్టణ ప్రణాళికలో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనలను వెలికితీసి, వాటిని ఇతరులతో పంచుకోవడాన్ని ప్రోత్సహించారు. అలాగే 'పట్టణ ప్రణాళిక, మహిళల భద్రత' అనే అంశంపై చర్చాగోష్ఠిని నిర్వహించారు. మహిళలకు అభద్రతా భావానికి దోహదపడే పట్టణ రూపకల్పనలో ఎదురవుతున్న సవాళ్లను విద్యార్థులు ఈ సందర్భంగా చర్చించారు. చివరగా విజేతలు, కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు. దీనిని అసిస్టెంట్ ప్రొఫెసర్ తపతి తపస్విత భంజా, విద్యార్థి బృందం శివాని, ముస్కాన్, అనుశ్రీ, భవ్య సమన్వయం చేశారు.


నవరాత్రి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు



అరచేతిలో.. ఉపాధి సమాచారం

● అందుబాటులోకి "జన్ మన్ రేగా" యాప్
● పనిదినాలు, చెల్లింపులు మరెన్నో తెలుసుకోవచ్చు
● జాబ్‌కార్డు నంబర్ నమోదుతో క్షణాల్లో వివరాలు

కోహీర్, అక్టోబరు 11 : ఉపాధి దొరకక గ్రామాలను వదిలి ఉపాధి కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లే వారి వలసలను నివారించేందుకు కేంద్ర సర్కార్ ఫిబ్రవరి 2006 సంవత్సరం నుంచి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలు చేస్తున్నది. ఉపాధి పనులు చేసే కూలీలకు డబ్బులు చెల్లింపుల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా అందించాలన్న లక్ష్యంతో బ్యాంకు, తపాలా ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు. అయితే కొందరి ఖాతాల వివరాలు బ్యాంకులకు, తపాలశాఖకు సరిగా అనుసంధానం లేకపోవడం, తప్పుగా నమోదు కావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా స్మార్ట్‌ఫోన్‌లో ఉపాధి కూలీల డబ్బుల వివరాలు తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తాజాగా 'జన్ మన్ రేగా' యాప్‌ను తీసుకువచ్చింది. సంగారెడ్డి జిల్లాలోని 646 గ్రామాల్లో 2.19 లక్షల జాబ్ కార్డులు ఉండగా 4.2 లక్షల మంది కూలీలు ఉన్నారు. వీరిలో కొందరికి బ్యాంకులో, మరికొందరికి తపాలాలో ఖాతాలు ఉన్నప్పటికీ వారి మొబైల్‌కు వచ్చే మెసేజ్‌లు చూసుకోవడం తెలియక, కొందరికి మెసేజ్‌లు రాక డబ్బుల జమ వివరాలు తెలియడం లేదు. ఈ సమస్యను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను తీసుకువచ్చి కూలి డబ్బులు జమ అయ్యాయో లేదో క్షణాల్లోనే తెలుసుకునే వీలు కల్పించింది.

మొబైల్ అప్లికేషన్ డౌన్‌లోడ్ ఇలా...

మొదట మొబైల్ ఫోన్‌లోని ప్లే-స్టోర్‌ను ఓపెన్ చేసి 'జన్ మన్ రేగా' మొబైల్ అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం యాప్‌ను ఓపెన్ చేసి జిల్లా, మండలం, గ్రామం, జాబ్ కార్డు నంబర్ ఎంటర్ చేయగానే సంబంధిత ఉపాధి హామీ కూలి వివరాలు కనిపిస్తాయి. అంతేకాకుండా ఎన్ని పని దినాలు పని చేశారో, ఎంత డబ్బు జమ అయిందో కనిపిస్తుంది. ఒకవేళ డబ్బులు జమ కాకపోతే కారణాలు కూడా చూపిస్తుంది. ఈ అప్లికేషన్‌లో చేపట్టే పనుల సమాచారం స్థానికంగా అక్రమాలపై ఫిర్యాదు కూడా చేసే అవకాశం ఉంది. అన్ని భాషల్లో ఈ అప్లికేషన్ రూపొందించబడింది.

సులువుగా కూలి వివరాలు తెలుసుకోవచ్చు

-ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ బాల్‌రాజ్



'జన్ మన్ రేగా' మొబైల్ యాప్ ద్వారా ఉపాధి కూలీలు తమ డబ్బుల వివరాలను క్షణాల్లో తెలుసుకునే అవకాశం ఉంది. గతంలో మొబైల్ యాప్ రాక ముందు కూలీలు తమకు డబ్బులు వచ్చాయో లేదో అని పదేపదే అడిగేవారు. ఉపాధి కార్యాలయానికి వెళ్లి తెలుసుకుంటేనే సమాచారం తెలిసేది. కానీ ప్రస్తుతం ప్రత్యేక యాప్ రాకతో క్షణాల్లోనే మన చేతిలో ఉన్న మొబైల్ ఫోన్‌లో వివరాలు అన్నీ తెలుసుకోవచ్చు.

సద్దుల సంబరం

● ఉత్సాహంగా బతుకమ్మ ఆడిన ఆడబిడ్డలు

సిద్దిపేట రూరల్, అక్టోబర్11 : తెలంగాణ సంస్కృతికి నిదర్శనమైన బతుకమ్మ పండుగలో భాగంగా చివరి రోజు శుక్రవారం నారాయణరావుపేట మండల కేంద్రంతో పాటు లక్ష్మీదేవిపల్లి, కోదండరావుపల్లి, బంజేరుపల్లి, ఇబ్రహింపూర్ గ్రామాల్లో సద్దుల బతుకమ్మ పండుగ ఘనంగా నిర్వహించారు. ఏటా ఈ ఐదు గ్రామాల్లో విజయ దశమి(దసరా) కి ముందే రోజు సద్దుల బతుకమ్మ జరుపుకోవడం అనవాయితీ. మహిళలు, ఆడబిడ్డలు తీరొక్క పూలతో చేసిన బతుకమ్మలను పేర్చి వాటి గ్రామ ప్రధాన చౌరస్తాలో ఒక చోట చేర్చి ఆట పాటలతో సంబురాలు జరుపుకున్నారు. అనంతరం డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా బతుకమ్మలను తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు. అనంతరం చెరువు గట్టుపై కుటుంబ సమేతంగా సద్దులను ఆరగించారు.


లక్ష్మీదేవిపల్లి గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బంజేరుపల్లి గ్రామంలో..


కోదండరావుపల్లిలో..

నకిలీ బంగారం ఇచ్చి రూ.3 లక్షలు కాజేశారు

సిద్దిపేట క్రైం, అక్టోబరు 11 : నకిలీ బంగారం ఇచ్చి భార్యాభర్తల నుంచి రూ.3 లక్షలు ఎత్తుకెళ్లిన సంఘటన సిద్దిపేట పట్టణంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రేణుకనగర్‌కు చెందిన ఉడుత రమేష్, రేణుక దంపతులు సిద్దిపేటలో కొంతకాలంగా లేడీస్ ఎంపోరియం నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 5న గుర్తుతెలియని ఓ వ్యక్తి మహిళతో టీవీఎస్ ఎక్సెల్ పై షాప్‌కు వచ్చి మేము అన్నాచెల్లెళ్లం అంటూ నమ్మబలికారు. వారికి కావలసిన పట్టీలు గాజులు కొనుక్కొని షాప్‌లో ఉన్న రేణుకతో పరిచయం చేసుకున్నారు. తర్వాత కొంత డబ్బు అవసరం ఉందని తమ వద్ద ఉన్న ఓ చిన్న బంగారపు ముక్కను రేణుకకు ఇచ్చారు. వారిని నమ్మించడానికి దానికి బదులుగా వారి నుంచి ఎలాంటి డబ్బులు తీసుకోకుండా వెళ్లిపోయారు. తర్వాత దానిని పరీక్షించగా అసలు బంగారమని తేలింది. మరుసటి రోజు గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి ఆ బంగారం ముక్కను తీసుకువెళ్లారు. తిరిగి గురువారం సిద్దిపేటకు వచ్చి మేము వేములవాడ కమాన్ దగ్గర ఉన్నాం మా వద్ద 25 తులాల బంగారు బిస్కెట్ ఉంది ఇది తీసుకొని బదులుగా రూ.3 లక్షల ఇవ్వాలని తెలుపగా వెంటనే రేణుక భర్త రమేష్ డబ్బులను తీసుకువెళ్లి ఇచ్చి బంగారు బిస్కెట్‌ను తీసుకున్నాడు. ఇంటికి వచ్చిన రమేష్ బంగారు బిస్కెట్‌ను పరిశీలించగా అది నకిలీ బంగారమని తేలింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● డీఆర్‌డీవో జయదేవ్ ఆర్య



మద్దూరు, అక్టోబరు 11: మహిళా సంఘాలను సమన్వయం చేసుకుంటూ ఉపాధిహామీ పథకంలో తయారు చేసిన ప్లానింగ్ పనులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో జయదేవ్ ఆర్య సూచించారు. మండలంలోని రేబర్తిలో శుక్రవారం పంచాయతీ సెక్రటరీ జాదవ్‌మాధవ్ అధ్యక్షతన ఉపాధి హామీ, ఐకేపీ మహిళా సంఘాల సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ప్లానింగ్ చేసిన పనులపై ఏ విధంగా ముందుకెళ్లాలో సూచించారు. వ్యక్తిగత పనులతో పాటు సహజవనరుల సంరక్షణ, వ్యవసాయ ఆధారిత పనుల గుర్తింపుపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏపీడీ శివాజీ, క్వాలిటీ కంట్రోల్ సంతోష్, ఈసీ పరుశురాములు, ఏపీఎం బాబురావుతో పాటు ఫీల్డు అసిస్టెంట్లు, టీఏ, సీసీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మహిషాసురమర్దనిదేవిగా మర్పడగ విజయదుర్గ

కొండపాక, అక్టోబరు 11: మండలంలోని మర్పడగ శ్రీవిజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. విజయదుర్గాదేవి శుక్రవారం మహిషాసుర మర్దిని దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. నిర్వాహకులు చెప్పెల హరినాథ్‌శర్మ పర్యవేక్షణలో ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. భక్తుల జయజయధ్వానాల నడుమ పల్లకీ సేవ క్షేత్రంలో ఆధ్యాత్మిక శోభను ఇనుమడింపజేసింది. ట్రాన్స్‌కో ఏఈ సత్యం, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రవీందర్, తిరుపతిరెడ్డి, నర్సింహారెడ్డి, సాయి ఉన్నారు.

● **దౌల్తాబాద్:** మండల కేంద్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం దుర్గామాతకు యజ్ఞం, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

● **చేర్యాల:** మండలంలోని చుంచనకోటలో దుర్గా మాత సేవాసమితి ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. పట్టణంలోని చావడివ వద్ద దేవీస్నేహయూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన, సుహాసిని పూజ జరిపారు.



చేర్యాల: చుంచనకోటలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

గ్రామీణ ప్రాంతాలకు ఏటీఎం సేవలు

● డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి

కొండపాక, అక్టోబరు 11: గ్రామీణ ప్రాంతలకు డీసీసీబీ ద్వారా ఏటీఎం సేవలు అందిస్తున్నట్టు డీసీసీబీ ఉమ్మడి జిల్లా చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని దుద్దెడ డీసీసీబీ బ్యాంక్ ఆవరణలో శుక్రవారం ఏటీఎంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు డీసీసీబీ ద్వారా అన్ని రకాల సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ బ్యాంక్ సీఈవో శ్రీనివాస్, డీజీఎం విశ్వేశ్వర్, ఏజీఎం చంద్రశేఖర్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ సుధారాణి, పీఏసీఎస్ సీఈవో రాజు, పీఏసీఎస్ డైరెక్టర్లు సురేందర్‌రావు, అమరేందర్, నరసింహచారి, నాయకులు లింగారావు తదితరులు ఉన్నారు.

ఆలయానికి విరాళం అందజేత

మద్దూరు, అక్టోబరు 11: మండలంలోని నర్సాయపల్లికి చెందిన మాజీ ఉపసర్పంచ్ శనగిరం సత్యనారాయణ శుక్రవారం శ్రీసీతారామ శతరుద్రేశ్వర స్వామి ఆలయాభివృద్ధికి రూ.1,01116ల విరాళాన్ని ఆలయ అర్చకులు మల్లావజ్జుల చంద్రశేఖర్‌కు అందించారు. కార్యక్రమంలో శ్రీపతిరెడ్డి, పోతూరు జితేందర్‌రెడ్డి, కొమ్మూరి శ్రీనివాస్‌రెడ్డి, శనగిరం కనకయ్య, శనిగరం బాలరాజు, కవ్వం భాస్కర్‌రెడ్డి, బద్దిపడిగు నవీన్‌రెడ్డి, చిలువేరు ఉత్తరయ్య, మోకు కనకారెడ్డి పాల్గొన్నారు.

● **కోహెడ:** మండలంలోని బస్వాపూర్ శ్రీపంచముఖలింగ సోమేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి పోరెడ్డిపల్లెకి చెందిన కోమండ్ల రజిని-శ్రీకాంత్‌రెడ్డి రూ. 20,116, మద్దుల అనిత-వరుణ్‌రెడ్డి రూ 50,116 విరాళాన్ని అందించారు.

డ్రగ్స్ నుంచి యువతను రక్షించాలి

● సీఐ మహేందర్‌రెడ్డి

మర్కుక్, అక్టోబరు 11: చెడు అలవాట్లు, డ్రగ్స్ బారి నుంచి యువతను రక్షించాలని సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రవల్లిలో శుక్రవారం క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత డ్రగ్స్‌కు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఎస్ఐ దామోదర్, రోటరీక్లబ్ ఆఫ్ గజ్వేల్ సెంట్రల్ అధ్యక్షుడు తుమ్మ కృష్ణలు, ఫ్యాక్స్ వైస్ చైర్మన్ కమ్మరి బాలరాజు, స్పోర్ట్స్ క్లబ్ మర్కుక్ మండల అధ్యక్షుడు చెనరాజ్ కృష్ణ పాల్గొన్నారు.

● **తొగుట:** మండలంలోని గుడికందులలో మాజీ ఉపసర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను మిరుదొడ్డి ఎస్ఐ పరుశురాములు ప్రారంభించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 12 అక్టోబరు 2024

నేడు విజయదశమి



తెలుగు వారికి పండగలంటే ఎంత ముఖ్యమో.. ఆ పండగల సందర్భంలో చేసే వంటలు కూడా అంతే ముఖ్యం. పండుగల సందర్భంగా చేసుకొనే అనేక వంటలను మన పూర్వీకులు గ్రంథస్తం చేశారు. అలాంటి కొన్ని అరుదైన వంటలను దసరా పండగనాడు చేసుకోవటానికి వీలుగా మీకు అందిస్తున్నాం..

వంటిల్లు

దసరా వేళ అరుదైన వంటలు

దేవీ నవరాత్రులు

నేటి అలంకారం

శ్రీరాజరాజేశ్వరీ దేవి

ఆశ్వయుజ శుద్ధ నవమి/దశమి (విజయదశమి)- శనివారం



శరన్నవరాత్రి మహోత్సవాల్లో... చివరి రోజైన విజయ దశమి నాడు విజయవాడ కనకదుర్గమ్మ శ్రీరాజరాజేశ్వరీ దేవిగా దర్శనమిస్తారు. ఆమె సకల భువన బ్రహ్మాండాలకు అధిదేవత. షోడశ మహా మంత్ర స్వరూపిణి అయిన శ్రీరాజరాజేశ్వరిని మహాత్రిపుర సుందరిగా, అపరాజితాదేవిగా భక్తులు ఆరాధిస్తారు. అపరాజితాదేవి పేరు మీద 'విజయదశమి' ఏర్పడింది. విజయాన్ని సాధించింది కాబట్టి 'విజయ' అని అంటారు. పరమ శాంత స్వరూపంతో, చిరునవ్వులు చిందిస్తూ, చెరుకుగడ చేతితో పట్టుకుని ఆమె దర్శనమిస్తుంది. మణిద్వీపంలో శ్రీపురంలో నివాసం ఉండే ఆమెను 'చింతామణి'గానూ పిలుస్తారు. పరమేశ్వరుడి అంకం ఆసనంగా... ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులను భక్తులకు ఆమె అనుగ్రహిస్తుంది. మాయామోహితమైన మానవ చైతన్యాన్ని యోగమూర్తిగా ఉద్దీపనం చేస్తుంది. అనంత శక్తి స్వరూపమైన శ్రీ చక్రానికి అధిష్ఠాన దేవత అయిన శ్రీ రాజరాజేశ్వరీ దేవిని పూజిస్తే సమస్త శక్తులూ సమకూరుతాయనీ, మన సారా కొలిస్తే బ్రహ్మజ్ఞానాన్ని ఆమె కలుగజేస్తుందనీ నమ్మిక. దసరా ఉత్సవాల సంపూర్ణ పుణ్యాన్ని భక్తులందరికీ అందించే చల్లని తల్లి దుర్గమ్మను రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో దర్శిస్తే సకల శుభాలు, విజయాలు లభిస్తాయన్నది భక్తుల విశ్వాసం. అమ్మవారిని ఎరుపు రంగు గాజులతో అలంకరించి, కుంకుమార్చన చేయడం శ్రేష్ఠం.

నైవేద్యం: పరమాన్నం, ఆరు రుచులతో కూడిన (షడ్రసోపేత) పదార్థాలు
అలంకరించే చీర రంగు: ఆకుపచ్చ, తెలుపు
వేటితో అర్చించాలి: ఎర్రటిపూలు
పారాయణ చెయ్యాల్సినవి: లలితా సహస్రనామం

వాటిని గెలవాలి!

పురాణపరంగానే కాకుండా సాంస్కృతికంగానూ ప్రాముఖ్యం ఉన్న పండుగ విజయదశమి. చెడుపై మంచి గెలిచిన రోజుగా దసరా పండుగను ఘనంగా నిర్వహిస్తారు. మానవులు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అనే అరిషడ్వర్గాలను జయించాలనీ, అదే ఈ విజయదశమి పండుగలోని అంతరార్థమనీ పెద్దలు చెబుతారు. విజయదశమి నాడు ఏది ప్రారంభించినా విజయం తథ్యం అనే విశ్వాసం ఉంది.

శమీ శత్రు వినాశినీ...

శమీ వృక్షం (జమ్మి చెట్టు)లో అపరాజితా దేవి కొలువై ఉంటుందని విశ్వాసం. విజయదశమి రోజున అపరాజితా దేవిని శమీవృక్షం వద్ద పూజించే సంప్రదాయం ఉంది. ఉద్భవించిన పవిత్రమైన దేవతా వృక్షాల్లో జమ్మి చెట్టు ఒకటని చెబుతారు. రావణ సంహారానికి ముందు శ్రీరాముడు శమీ వృక్షానికీ, అపరాజితా దేవికీ పూజలు ఆచరించాడని పురాణాలు పేర్కొంటున్నాయి. పాండవులు అజ్ఞాతవాసం ముందు తమ ఆయుధాలను శమీ వృక్షం మీద దాచారనీ, అజ్ఞాతవాసం ముగిశాక వాటిని తిరిగి తీసుకున్నారనీ మహాభారతంలో కథ ఉంది. దసరా నాడు...



శమీ శమయతే పాపం శమీ శత్రువినాశిని అర్జునస్య ధనుర్ధారి రామస్య ప్రియదర్శిని... అనే శ్లోకం పఠించి, జమ్మి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తే... శత్రు భయం తొలగి విజయం చేకూరుతుందనీ సకల కార్యసిద్ధి కలుగుతుందనీ పెద్దలు చెబుతారు.

శుభప్రదం పాలపిట్ట దర్శనం

దసరా పండుగలో శమీ వృక్షంతో పాటు పాలపిట్టకు ఉన్న ప్రాధాన్యం కూడా ఎక్కువే. పాలపిట్టను పవిత్రంగా భావించడం వెనుక ఉన్న జానపద గాథ ప్రకారం... పాండవులు అరణ్యవాసం, అజ్ఞాతవాసం పూర్తి చేసి తిరిగి వస్తూ ఉండగా, వారికి పాలపిట్ట కనిపించింది. వారు దాన్ని చూసినప్పటి నుంచీ వరుసగా అన్నీ విజయాలే కలిగాయట! అందుకే విజయ దశమి రోజున పాలపిట్టను దర్శించడం శుభప్రదంగా భావిస్తారు. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో పాలపిట్టను భక్తిప్రపత్తులతో ఆరాధిస్తారు. ●



సరడాల పాసెం


క్రీ.శ. 1800 నాటి 'వెంకటాచల విహార శతకం'లో 'సరడాల పాసెం' అనే వంటకం ప్రస్తావన ఉంది. సంస్కృతంలో వంకీల నెక్లెస్ శరణ్ణ అంటారు. బహుశా అందుకే వెంకటాచల కవి తెలుగులో దీనిని తెలుగులో 'సరడు' అన్నారు. సరడాల పాసెం అంటే వంకీల దండలాగా ఒత్తి వండిన పాలతాలికల్లాంటి వంటకం. శ్రీనాథుడు రాసిన 'చిరువడముల పాయసం' కూడా ఇదే కావచ్చు. వడములంటే తాళ్ళు. సన్నని తాళ్లలా ఒత్తి కలిపితే చిరువడముల పాయసం.

కావాల్సిన పదార్థాలు

సగ్గుబియ్యం- ఒక కప్పు, బియ్యపు పిండి- రెండు కప్పులు, బెల్లం పొడి- ఒక కప్పు, పాలు- ఒక లీటరు, డ్రైఫ్రూట్స్- తగినన్ని, నెయ్యి- తగినంత ఏలకుల పొడి- ఒక చెంచా, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- ముందుగా సగ్గుబియ్యాన్ని బాగా కడిగి - రెండు గంటలు నానబెట్టాలి.
- ఒక మూకుడులో నెయ్యిని కాచి.. దానిలో డ్రైఫ్రూట్స్‌ను వేసి వేయించాలి. వాటిని బయటకు తీసి ఒక ప్లేటులో చల్లార్చాలి.
- ఆ మూకుడులోనే సగం కప్పు బెల్లం పొడి, నీళ్లు కలిపి లేత పాకం పట్టాలి. దానిలో కప్పు బియ్యం పొడి వేసి ముద్దగా చేయాలి.
- ఇలా చేసిన ముద్దను సన్నని దారపు పోగుల్లా ఒత్తుకోవాలి. వీటిని కొద్ది సేపు ఆరనివ్వాలి.
- మరో గిన్నెలో పాలను బాగా మరిగించాలి. ఈ పాలలో సగ్గుబియ్యం వేసి ఉడికించాలి. ఇలా ఉడికిన పాలలో మిగిలిన సగం కప్పు బెల్లం వేయాలి.
- ఈ మిశ్రమం చిక్కపడుతున్న సమయంలో దానిలో ముందుగా చేసి ఉంచిన బియ్యపు తాలికలను వేయాలి. ఆ తర్వాత డ్రైఫ్రూట్స్‌ను వేయాలి.



జాగ్రత్తలు

- బెల్లం పాకం పట్టే సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. పాకం ముదిరితే తాలికలు చేయటం చాలా కష్టమయిపోతుంది.
- పాలను ఎంత ఎక్కువగా కాస్తే- అంత చిక్కని పాసెం తయారవుతుంది.

ఆవపచ్చడి



ఆహారాన్ని సులభంగా అరిగించే శక్తి ఆవపచ్చడికి ఉంది. అందుకే ఒకప్పుడు పండగ రోజుల్లో ఆవపచ్చడిని తప్పనిసరిగా చేసేవారు. "ముకు మంద్రై యేర్చు నావం జిగుర్కొను పచ్చళ్ళ" అంటూ రాయల వారు ఆముక్తమాల్యదలో ఆవకూరనీ, ఆవపచ్చడినీ జలుబు నీళ్లు వదిల్చే ముక్కుమందుగా అభివర్ణించాడు. "మిసిమి కలిగిన బంగారపు రంగు పుల్లపెరుగులో ఆవపిండి కలిపి తాలింపు పెట్టిన ఆవపెరుగుపచ్చడిని అతిథులు ఆస్వాదిస్తూ దాన్ని జుర్రుకోగానే.. ఆ ఘాటుకి మూర్ధాలదిరి, ఒ్రరదనం నషాలానికి అంటిందనీ.. ముక్కుల్లోంచి పొగలు వెడలినాయనీ" అంటాడు శ్రీనాథుడు. అలాంటి ఆవపచ్చడి ఎలా చేయాలో చూద్దాం..

కావాల్సిన పదార్థాలు

ఆవాలు- రెండు చెంచాలు, కూరముక్కలు- మూడు కప్పులు, కొబ్బరి తురుము- రెండు చెంచాలు, పెరుగు- మూడు కప్పులు, తరిగిన కొత్తిమీర- రెండు స్పూనులు, ఉప్పు- తగినంత

తయారీ విధానం

- ఆవాలను దోరగా వేయించి.. వాటిని మిక్సీలో పొడి చేయాలి.
- కూరముక్కలను నీళ్లలో కానీ కుక్కర్‌లో కానీ మెత్తపడేదాకా ఉడకపెట్టాలి. ఆ తర్వాత బయటకు తీసి చల్లార్చాలి.
- ఒక గిన్నెలో చల్లారిన కూరముక్కలు, పెరుగు, కొత్తిమీర, కొబ్బరి తురుము, ఉప్పు వేసి బాగా కలపాలి. దీనిలో ఆవాల పొడిని కలపాలి.
- ఈ పచ్చడిని గంట సేపు మూతపెట్టి మగ్గనివ్వాలి. దీని వల్ల ఆవ ఘాటు పచ్చడి అంతా వ్యాపిస్తుంది.

జాగ్రత్తలు

- ఆవాలను సన్నటి సెగ మీద వేయించాలి. ఎక్కువ వేడి తగిలితే ఆవాలు మాడిపోతాయి.
- కొందరు ఈ పచ్చడిలో తాలింపు పెడతారు. తాలింపు పెట్టకపోయినా తినటానికి చాలా బావుంటుంది.

అంగరొల్లెలు

'అంగ' అంటే కాల్చు, కప్పు అని రెండర్థాలున్నాయి. ఒల్లె అంటే మృదువైనదని అర్థం. మంటలో కాల్చిన తర్వాత మృదువుగా ఉండే తత్వం ఉంది కాబట్టి శ్రీనాథుడు వీటిని అంగర పూవియలు అన్నాడు. ఉత్తర భారత దేశంలో వీటిని చోఖాభాటీ అంటారు. వీటిని వంకాయ బజ్జీ పచ్చడితో కలిపి తింటారు.

కావాల్సిన పదార్థాలు

శనగపిండి- ఒక కప్పు, జీలకర్ర- అర స్పూను, వాము- పావు స్పూను, ఎర్రకారం- ఒక స్పూను, సన్నగా తరిగిన అల్లం- అర స్పూను, పచ్చిమిర్చి- ఒక స్పూను, వెల్లుల్లి- రెండు రెబ్బలు, సన్నగా తరిగిన కొత్తిమీర- ఒక స్పూను, సైంధవ లవణం- పావు స్పూను, నిమ్మ రసం- రెండు స్పూనులు, నెయ్యి- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- శనగపిండిని నీళ్లు పోసి గట్టిగా కలిపి చిన్న చిన్న ఉండలుగా చేయాలి.
- జీలకర్ర, వాము, ఎర్రకారం, అల్లం, పచ్చిమిర్చి, వెల్లుల్లి, కొత్తిమీర, సైంధవ లవణం, నిమ్మరసంలను ఒక గిన్నెలో వేసి స్పూనుతో మెత్తగా చేయాలి.
- శనగపిండి ఉండలను పూరీల మాదిరిగా ఒత్తాలి. వీటిలో తయారుచేసిన మిశ్రమాన్ని పెట్టి- చిన్న చిన్న ఉండలుగా చేయాలి. వీటికి నెయ్యి రాయాలి.
- ఈ ఉండలను బొగ్గు మీద కాల్చాలి. ఒక వేళ బొగ్గులు లేకపోతే గ్యాస్‌స్టవ్ మీద గ్రిల్ పెట్టి సన్నటి మంటపైన కాల్చాలి.
- కాల్చిన తర్వాత పైన నల్లగా ఒక పొర ఏర్పడుతుంది. ఆ పొరను వలిచి తినాలి.



జాగ్రత్తలు

- శనగపిండిని కలిపే సమయంలో ఉండలు లేకుండా చూసుకోవాలి.
- అంగరొల్లెలను కాల్చే సమయంలో జాగ్రత్తగా ఉండాలి. ఎక్కువ మంటపై కాలిస్తే బొగ్గులా మారిపోతుంది.



చెఫ్: **వి.నగేష్**
వివాహ భోజనంబు
జూబ్లీహిల్స్, హైదరాబాద్
99899 61488



అలనాటి కథ

నాకు తెలిసిన రతన్ టాటా!

గురువారం ఉదయం మామూలుగానే లేచా.. లేచిన వెంటనే పత్రికలు చూడటం అలవాటు. పేపరు తెరిచిన వెంటనే 'రతన్ టాటా ఇక లేరు' అనే హెడ్డింగ్ కనిపించింది. ఒక్క నిమిషం షాక్ తగిలినట్లు అనిపించింది. వెంటనే ప్రిన్సెస్ ఏస్రాకు మెసేజ్ పంపించాను. తనకు కూడా ఆ దుర్వార్త తెలియదు అనుకుంటా! షాక్ తింది. రతన్ టాటాతో మా అనుబంధం ఈనాటిది కాదు.



మాకు ముంబాయిలో ప్యాలెస్ ఉంది. ఈ ప్యాలెస్‌లో నాన్న రాజా ధన్‌రాజ్‌గిరి పార్టీలు ఇస్తూ ఉండేవారు. ఈ పార్టీలకు ముంబాయిలో ఉన్న రాజ కుటుంబీకులు, పార్సీ వాణిజ్యవేత్తలు, రాజకీయ నాయకులు- ఇలా అనేక మంది హాజరవుతూ ఉండేవారు. ఇలా నాకు జేఆర్‌డీ టాటా తెలుసు. ఆయన భార్య కూడా తెలుసు. ఆమె అప్పుడప్పుడు మమ్మల్ని వాళ్లింటికి మధ్యాహ్న భోజనాలకు పిలిచేది. మంచి పార్సీ వంటలు వండించి పెట్టేది. జేఆర్‌డీ ద్వారా మాకు నోవెల్ టాటా, ఆయన భార్య సిమోని కూడా తెలుసు. వారితో పాటుగా రతన్ టాటా కూడా పరిచయం ఏర్పడింది. ఆ రోజుల్లో ముంబాయి- ఇప్పుడున్నంత హడావిడిగా ఉండేది కాదు. సాయంత్రాలు అనేక మంది బీచ్ ఒడ్డున కూర్చుని స్నేహితులతో కబుర్లు చెప్పుకుంటూ ఉండేవారు. నేను కూడా అప్పుడప్పుడు స్నేహితులతో కలిసి బీచ్‌లకు వెళ్తూ ఉండేదాన్ని. ఆ సమయంలో నాకు ఉన్న స్నేహితురాలు లీనా భక్తావర్‌లో ఒక ఫ్లాట్‌లో నివసించేది. ఆ ఫ్లాట్లలోనే రతన్ కూడా నివసించేవాడు. లీనా దగ్గరకు వెళ్లినప్పుడు ఎదురుపడేవాళ్లం. మాట్లాడుకొనేవాళ్లం. ఇక నా చెల్లెలు రేణుకకు తన క్లాస్‌మేట్ అనుకుంటా. అందుకే అప్పుడప్పుడు రతన్ గురించి ప్రస్తావన వచ్చేది. రతన్ చూడటానికి అందంగా, హుందాగా ఉండేవాడు. తక్కువగా మాట్లాడేవాడు. తండ్రి మాట జవదాటడని చెప్పుకుంటూ ఉండేవాళ్లం. బహుశా అందుకే తనకు ఇష్టం లేకపోయినా అమెరికా నుంచి వచ్చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ తర్వాతి కాలంలో నేను హైదరాబాద్ వచ్చేసాను. మాకు కొంత మంది కామన్ ఫ్రెండ్స్ ఉన్నా- ఎక్కువ సార్లు కలవలేదు.

రతన్‌ను నేను మళ్లీ కలిసింది- ఫలక్ నామా ప్యాలెస్ ప్రారంభోత్సవంలో. టాటా గ్రూపునకు చెందిన తాజ్ హోటల్స్ ఈ ప్యాలెస్‌ను లీజ్‌కు తీసుకొని హోటల్‌గా పునరుద్ధరించారు. దీని ప్రారంభోత్సవానికి దేశంలోని అనేక మంది ప్రముఖులు హాజరయ్యారు. టాటా గ్రూపు ఛైర్మన్ హోదాలో రతన్ కూడా వచ్చారు. ఆ సమయంలో మళ్లీ తనను కలిసాను. కాలేజీలో ఉన్నప్పుడు ఎంత హుందాగా ఉన్నాడో.. అంతే హుందాగా ఉన్నాడు. ఆప్యాయంగా పలకరించాడు. ఆ తర్వాత మేమిద్దరం పెద్దగా కలసినది లేదు. కానీ తన వ్యక్తిత్వంతో ఒక చెరగని ముద్ర వేశాడు. నాకు తెలిసి- శత్రువులు లేని అతి కొద్ది మంది వ్యక్తుల్లో రతన్ కూడా ఒకరు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. 1962లో ఇండో-చైనా యుద్ధం జరుగుతున్న సమయంలో అనుకుంటా- రతన్ అమెరికాలో ఒక అమ్మాయిని పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. కానీ రతన్ కొన్ని కారణాల వల్ల భారత్‌కు తిరిగి వచ్చేయాల్సి వచ్చింది. ఆ అమ్మాయి ఇండియాకు రాలేని పరిస్థితి. దాంతో ఆ పెళ్లి ఆగిపోయింది. ఆ సమయంలో ముంబాయి సోషల్ సర్కిల్స్‌లో అదొక పెద్ద వార్త. కారణం తెలియదు కానీ- ఆ తర్వాతి కాలంలో రతన్ ఎవరినీ పెళ్లి చేసుకోలేదు. ఒంటరిగానే మిగిలిపోయాడు. ఆ ఒంటరితనాన్ని కూడా హుందాగా గడిపాడు. తాను చిన్నప్పటి నుంచి నేర్చుకున్న విలువలను తుదిదాకా వీడని అతి కొద్ది మందిలో రతన్ ప్రథమ స్థానంలో ఉంటాడనటంలో ఎటువంటి సందేహం లేదు!

● రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

భోజన విధి

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

ఆయుర్వేద సంహితా గ్రంథాల యుగం తరువాత ఆహార ప్రాధాన్యతని వివరిస్తూ 15వ శతాబ్దిలో క్షేమశర్మ- "క్షేమకుతూహలం". 15వ శతాబ్దిలో పండిత రఘునాథ సూరి "భోజనకుతూహలం" గ్రంథాలను వెలువరించారు. క్షేమకుతూహలంలో లేని అనేక ఆహారవైద్య విషయాలు భోజనకుతూహలంలో ఉన్నాయి. 1678లో తంజావూరులో మరాఠా రాజ్యస్థాపన చేసిన ఏకోజీ (శివాజీ సవతి సోదరుడు) రాణి దీపాంబికల ప్రోత్సాహంతో రఘునాథ పండితుడు భోజన కుతూహలం రాశాడు. తంజావూరులోనే నివసించాడు. అక్కడి తెలుగు వారితో పరిచయం కారణంగా భోజన కుతూహలంలో తెలుగుదనం కనిపిస్తుంది. ఇది సంస్కృత రచనే అయినా మనకు దగ్గరగా ఉంటుంది. కుతూహలం అంటే ఉత్సాహం, కోరిక అనే కాదు, అద్భుతమైన, ఉన్నతమైన, గొప్పదైన, ప్రశంసనీయమైన అనే అర్థాలు కూడా ఉన్నాయి. భోజనం తయారీ, దాన్ని వడ్డించటం, తినటం లాంటి విషయాల్లోని శాస్త్రీయతను వివరించటమే ఈ భోజనకుతూహలం లక్ష్యం.

అన్నమే ప్రాణాన్నిస్తోంది. అన్నమే సమస్త జీవులకూ పోషణ నిస్తోంది. ఆయుష్షునిస్తోంది. ఈ సృష్టి మొత్తాన్ని సంరక్షిస్తోంది. అన్నం లేకపోతే జీవి లేదు, జీవం లేదు. ప్రాణదాత అయిన అన్నానికి దణ్ణాలు చెపుజి;కుంటూ రఘునాథ సూరి షుమారుగా 350 ఏళ్ల క్రితం రాసిన భోజన కుతూహలం గ్రంథం కుతూహలం కలిగించే అనేక ఆహార విషయాల సమాహారంగా సాగుతుంది. "ఇతి వ్యాసస్మరణాచ్చ భోజనద్రవ్యాణి తద్గుణాశ్చభిదీయతేఖ"- ఈ విధంగా వ్యాసభగవానుణ్ణి స్మరించుకుంటూ, భోజన ద్రవ్యాలు, వాటి గుణాలు చక్కగా వివరిస్తానని సంకల్పం చెప్పుకొని భోజనకుతూహలం గ్రంథాన్ని ప్రారంభిస్తాడు పండిత రఘునాథ సూరి.

"జీర్ణే హితం మితం చాద్యాత్ ఇత్యాయుర్వేదోపదేశాత్

భోక్తవ్యం సఘృతం సోష్ణం హితమ్ పథ్యం మితం తథాఖ!"

అనే శ్లోకంలో ఎలాంటి ఆహారాన్ని తినాలనే విషయాన్ని వర్ణిస్తాడు, దీనిలో కొన్ని ముఖ్యమైన అంశాలున్నాయి.

జీర్ణశక్తి ఆధారంగా..

సాధారణంగా తేలికగా జీర్ణమయ్యే పదార్థాలే తినాలి. మన జీర్ణశక్తి ఎంత సమర్థమైనదో దాన్ని బట్టి తీసుకోదగిన ఆహారాన్ని ఎంచుకోవాలి. పర్వతాలు ఫలహారం చేయగలంత జీర్ణశక్తి ఉన్నవారికి ఏది తిన్నా చెల్లిపోతుంది. కానీ కడుపులో జాఠరాగ్ని అరకొరగా ఉన్నప్పుడు ఏదో ఒక సమస్య బాధిస్తూనే ఉంటుంది సమస్తమైన అనారోగ్యాలకూ జీర్ణశక్తి వైఫల్యమే మొదటి కారణం. కాబట్టి ప్రయత్న పూర్వకంగా అగ్నిబలం కాపాడలంటుంది శాస్త్రం. జీర్ణే అంటే ఒకసారి తీసుకున్న ఆహారం పూర్తిగా అరిగాకే మరో ఆహారం తినాలని.

నాలుగు సూత్రాలు

"సఘృతం సోష్ణం హితమ్ పథ్యం" అంటూ ఆహారానికి సంబంధించి నాలుగు సూత్రాలను రఘునాథ పండితుడు వివరిస్తున్నాడు. అవి
1) కల్తీ లేని మంచి నెయ్యితో భోజనం
2) వేడిగా తాజాగా ఉన్న ఆహారం
3) సరిపడే పదార్థాలను తెలుసుకుని తినటం
4) మోతాదెరిగి మితంగా తినటం

హితవైన ఆహారం

తినబోయే ముందు ఆ పదార్థం మన శరీరానికి సరిపడుతుందో.. లేదో కూడా ఆలోచన చేయాలి. ఒకప్పటికన్నా ఎలర్జీ రోగుల సంఖ్య ఇప్పుడు ఎక్కువగా ఉంది. ఎలర్జీ తీవ్రతను తగ్గించాలంటే ఆచితూచి తినటం అవసరం.

మితాహారం: ఏ పదార్థాన్నయినా మితంగానే తినాలి. ఒకే పదార్థాన్ని అదేపనిగా తింటే వికటిస్తుంది. ఆహారం అనేది ఔషధం కాబట్టి మోతాదెరిగి తీసుకోవాలి.

ఆద్యం: ఆద్యం అంటే అన్ని పోషకాలూ కలిగి ఆరురుచులతో కూడిన రాజభోజనం అని!

ఆయుర్వేదం వివిధ ఆహార ద్రవ్యాలలోని పోషకాలను వాటికి గల రుచులను బట్టి నిర్ణయిస్తుంది. మనం తినే మొత్తం అన్నంలో తీపి, పులుపు, ఉప్పు, కారం, వగరు, చేదు ఈ ఆరు రుచులూ ఉండేలా చూసుకుంటే అది 'ఆద్యం'.

